# ప్రార్థన
# 4

## సువార్తికులు

సువార్తికులనుండి నేను అధికంగా ఎదురు చూస్తూ, కోరుతున్నాను. ఇది బైబిలు సంబంధమైనది: "... ఎవనికి ఎక్కువగా ఇయ్యబడెనో వానివద్ద ఎక్కువగా తీయ జూతురు ..." (లూకా 12:48). "సువార్తికుని అతి ప్రాముఖ్యమైన పని ఏమి?" ఈ ప్రశ్న ప్రసంగ వేదికలమీదను, కాలేజీ క్లాసులలోను, సువార్తికుల రిట్రీటులలోను లేవనెత్తవలసియుంది. నీవు దీనికి ఎలా బదులిస్తావు? పఠించడమనా? ప్రసంగించ డమనా? ఉపదేశించడమనా? దర్శించడమనా? ఆత్మలను సంపాదించడమనా? ధర్మ కార్యాలనా? సామాజిక బాంధవ్యాలనా? సువార్తికుని యొక్క ప్రాథమికమైన అతి ముఖ్యమైన పని ఏమైయుంటుంది? బైబిలు సంబంధమైన జవాబు ప్రార్థన! మొదటిగా ప్రార్థించకుండ ప్రభువైన యేసు తన పరిచర్యను మొదలుపెట్టేవాడుకాదు. పెంతెకొస్తు (అపొ. 2) ప్రార్థననుండి వచ్చిందే (అపొ. 1). బైబిలు సంబంధమైన పూర్వ సంభవం అపొ. 6:4: "... మేము ప్రార్థనయందును వాక్య పరిచర్యయందును ఎడతెగక యుందుమని చెప్పిరి." అపొస్తులులకైతే ప్రసంగ వేదికకు ముందే ప్రార్థన వచ్చింది! తన వీడ్కోలు చర్చలో (యోహాను 14-16), ప్రార్థన మీదను పరిశుద్ధాత్మ మీదను సమాచారాన్ని కేంద్రీకరించడంవలన ప్రభువైన యేసు విశ్వాసాన్ని నొక్కి చెప్పాడు. ఆ పన్నిద్దరికి యేసు చేసిన రెండు గొప్ప వాగ్దానాలు, ప్రార్థన మరియు పరిశుద్ధాత్మ. ఇక్కడ మన శక్తి ఉంది, అయినా ప్రార్థించడంలో మనం తప్పిపోతాం! దేవుడు మాత్రమే సంఘాన్ని కట్టగలడు! దేవుని సంఘం మానవునిచేతగాని, మానవుని మీదగాని కట్ట వీలుపడదు. మన ఏర్పాట్లను దీవించుమని మనం దేవుని ప్రార్థించడం కాదు. ఆయన ఎక్కడ పని చేస్తున్నాడో అక్కడ మనలను నిలుపుమని అడగడమే ప్రార్థించడం. అనేక సంఘాలలో ప్రార్థన లేమి ఎంతో ఎక్కువగా ఉంది! సంఘం యొక్క ప్రస్తుతపు అవసరత క్రొత్తదనమో, తలాంతో కాదు - బహుగా అవసరమైనది - ప్రార్థన! "మొదట ప్రార్థించండి!" అనే గురుతు సువార్తికుల యొక్క వ్రాత బల్లలమీద ఉండాలి.

విషాదకరమైన వాస్తవమేమంటే - సువార్తికులు కొద్దిగా ప్రార్థిస్తారు లేక అసలు ప్రార్థించరు. దేవుని గూర్చి మనుష్యునితో మాటలాడక ముందు మనిషిని గూర్చి దేవునితో మాటలాడాలి. "నేను బహుగా ప్రసంగించి బహు తక్కువగా పఠించాను" అని బిల్లి గ్రేహం ఒప్పుకున్నాడు. నేను దీన్ని చేర్చుతాను: "నేను బహు ఎక్కువగా ప్రసంగించి, బహు తక్కువగా ప్రార్థించాను." "సత్వర జ్ఞాపకశక్తి తమ సువార్తికునికి ప్రసాదించుమని"

సహోదరులు సహజంగా ప్రార్థిస్తారు. సువార్తికులకు కావలసినది దానికంటెను యింకా ఎక్కువైనది ఉంది! అనేకమంది సువార్తికులు చదవరు, పరిశీలించరు, ఆలోచింపరు. ఇది విషాదకరం. ఆ పరిస్థితులలో ప్రార్థన వారిని తప్పించలేదు! ప్రార్థించే సువార్తికులు లేఖనాల్లో ఏపుగా ఎదిగినవారైయుంటారు. "వాక్యమందు వేరుపారినవారు" ప్రార్థిస్తారు. ప్రార్థనను లేఖనాలలోనుండి మనం విడదీయలేం. ప్రార్థనాపరుడే బైబిలును సరిగా అర్థం చేసికోగలడు. మోకాటిమీద ఒకడు ఏమైయుంటాడో అదే అతడంతా. ఉపవాసం చేయడం కంటె సువార్తికులు విందుల్లో బాగా ఉంటారు, ఆరాధనలోకంటె వినోదంలోను, ప్రార్థించడంకంటె ప్రసంగించడంలోను ఎక్కువగా ఉంటారు. ప్రసంగం యొక్క శక్తి, ప్రసంగానికి ముందు చేసిన ప్రార్థన మీద ఆధారపడియుంటుంది.

కొన్నిసార్లు స్థానిక సంఘాలు సువార్తికులను వెదకుతూ ఉంటాయి. "ఇంటర్వ్యూల్లో" నన్ను అనేక రకాలైన ప్రశ్నలు అడిగారు. ఇది మంచిదియు జ్ఞానయుక్తమునైయుంది. అది జ్ఞానయుక్తమయ్యిందో లేక అర్థరహితమయ్యిందో – అడిగే ప్రతి ప్రశ్నకు నేను జవాబు చెప్పేవాడిని. నన్ను నిజమైన ప్రశ్న ఎన్నడే అడుగలేదు: "హడ్లే, నీ ప్రార్థనా జీవితం ఎలాగుంది?" తలాంతు ఉన్నా, రూపురేఖలున్నా, అమ్మకపు సామర్థ్యమున్నా వ్యక్తులను పెట్టుకుంటూ ఉంటాం – మనం ప్రార్థనాపరులైన మనుష్యులను పెట్టుకోవాలి. ఏ గొప్ప జ్ఞానోదయమైనా ప్రార్థనవలననే వస్తుంది. నీవు ప్రార్థిస్తావా? నీవు ప్రార్థించడానికి ప్లాన్ చేస్తావా? నీవు నిజంగా ప్రార్థించేవరకు ప్రార్థిస్తావా? ప్రార్థనకు ప్రతిఫలంగా దేవుడు పని చేస్తాడు.

సహోదరులు నా కొరకు ప్రార్థించినప్పుడు, వారు నన్ను నమ్ముతారు, ప్రేమిస్తారు. పరిచర్యలో నా మొదటి పని ప్రార్థన. నేను అనుదినం సంఘం కొరకు – సభ్యులు, పరిచర్యలు, సమస్యలు, అభ్యంతరాల కొరకు ప్రార్థిస్తాను. ఆదివారం సంఘ కూడిక స్థలంలోగుండా సంవత్సరాల తరబడి నడుచుకొంటూ వారి సీట్లు దాటి వెళ్లేటప్పుడు నేను ప్రార్థిస్తూ ఉంటాను. సువార్తికుని పరిచర్యలో ప్రార్థన ప్రధానమైనదియు మొదటిదియునైయుండాలి. మోషే ఇశ్రాయేలీయుల కొరకు ప్రార్థించాడు. పౌలు సంఘాలకొరకు ప్రార్థించాడు. సమూయేలు యిలా అన్నాడు: "... నా మట్టుకు నేను మీ నిమిత్తము ప్రార్థన చేయుట మానుటవలన యెహోవాకు విరోధముగ పాపము చేసినవాడన గుదును. అది నాకు దూరమగునుగాక" (1 సమూ. 12:23).

కొన్నిసార్లు సువార్తికులు ప్రవక్తలవలె ఉంటారని చాలమందికి తెలుసు – దేవుని వాక్యాన్ని మనం ప్రకటిస్తాం. సువార్తికులు కొన్నిసార్లు యాజకులవలె ఉంటారని ఎక్కువ మంది మరచిపోతారు – సహోదరుల పక్షంగా మనం దేవునికి మొరపెడతాం. ప్రవక్తలవలె ఉండకముందు సువార్తికులు యాజకులవలె ఉండవలసియుంది. మనం గొర్రెలకొరకును – మేకల కొరకు కూడా ప్రార్థించాలి! ఇది సంఘం యొక్క తొలి బాధ్యతయైయుంది. (శీలములో) అతడు దైవ జనుడైయుండాలి. అతని అతి ప్రాముఖ్యమైన పని ప్రార్థనయైయుంది. అప్పుడు దైవజనుని యొద్దనుండి సంఘము దైవ సందేశం వినాలి.

# నిజమైన ప్రార్థన యొక్క లక్షణాలు

## (మత్తయి 26:36-44; లూకా 22:42-44)

> "ఆయన వేదనపడి మరింత ఆతురముగా ప్రార్థన చేయగా ఆయన చెమట, నేల పడుచున్న గొప్ప రక్త బిందువులవలె ఆయెను (లూకా 22:44)."

ఒక సహోదరుడు ముగింపు ప్రార్థన చేస్తూ యిలా అన్నాడు: "మన తలలువంచి ప్రార్థనయందు మనస్సులను మూసికొందాం." ప్రార్థన జీవితపు కేంద్రానికి రావాలి. "ప్రార్థించు ... నీవు యింకా ఎక్కువగా ప్రార్థిస్తావు." ప్రార్థన – ఎంత గంభీరమైన ఆలోచన! ఎంతటి భాగ్యం! మనం ఎందుకు ఎక్కువగా ప్రార్థించం?

నిజమైన ప్రార్థనకు కొన్ని లక్షణాలుంటాయి. లేకుంటే ప్రార్థన ఆచారంగాను, అవివేకంగాను, విగ్రహారాధనగాను ఔతుంది. ప్రార్థన ఏది లేకుండా ఏదో పొందే చౌకబారు విధానం కాదు. సర్వశక్తుడును సర్వోన్నతుడునైన దేవుని సముఖానికి ప్రవేశించడం ప్రార్థనలోని ధన్యతయైయుంది. "దేవదూతలు వెళ్ల భయపడే స్థలానికి" మనం త్వరపడి వెళ్లకూడదు. ప్రాథమికంగా ప్రార్థన తరువాత ఏమి జరుగుతుందో మనకు తెలుసు. అయినా ప్రార్థనకు ముందు మనం ఏమి గ్రహించాలనేదాని విషయంలో తప్పిపోతాం. అవును, మొదటిగా ప్రార్థించాలి అనే అవసరతను మనం స్థిరపరచాం! ఆమేన్! నిజమైన ప్రార్థనను తయారుచేయడానికి, ప్రార్థనకు ముందు కొన్ని సూత్రాలు వస్తాయి.

### నిజమైన ప్రార్థనకు పూర్వ సంభవాలు

(1) **దీనమనస్సు.** "నా పేరు పెట్టబడిన నా జనులు తమ్ముతాము తగ్గించుకొని ప్రార్థనచేసి నన్ను వెదకి తమ చెడుమార్గములను విడిచినయెడల, ఆకాశమునుండి నేను వారి ప్రార్థనను విని, వారి పాపమును క్షమించి, వారి దేశమును స్వస్థపరచుదును" (2 దినవృ. 7:13, 14). స్వార్థపరత్వంనుండి మనలను దూరం చేసేది ఏమి – దేవుని విక్రయించు యంత్రంగా కుదించకుండ చేసేదేమి? దీనమనస్సు. ఒకడు ప్రార్థించక ముందు తన్ను తాను తగ్గించుకోవాలి. "దేవా, నన్ను అణచు" అంటూ అనేక పర్యాయాలు లేఖన సంబంధం కాని ప్రార్థనలను మనం చేస్తూ ఉంటాం. సమస్తం దేవుని స్వాధీనంలోనే ఉంది. దేవుడు శిక్షిస్తాడు, అయితే మనిషే తనకు తాను దీనమనస్సు గలవానిగా చేసికోవాలి. దేవుడు బలీయమైన అద్భుతాలను చేశాడు, అయితే ఫరో ఎన్నడు తన్ను తాను తగ్గించుకోలేదు. యూదా తన్ను తాను తగ్గించుకోలేదు, పేతురు తగ్గించుకున్నాడు. గర్వము మరియు ప్రార్థన రెండును మిళితం కావు. నరుడు నిస్సహాయుడు. "ముసలి

మనిషి యొక్క ఒకే బలము ప్రార్థన" అని థామస్ జెఫర్‌సన్ అన్నాడు. యౌవ్వనులు తమ బలముమీదను, ధనికులు తమ ఐశ్వర్యం మీదను నమ్మికయుంచుతారు. నిస్సహాయులు దేవునివైపు తిరుగుతారు!

(2) **ఆలోచన**. ప్రార్థన ఆశపడడం కాదు. ప్రార్థించే మనిషి ఆలోచించాలి, సిద్ధపడాలి. "మెలకువగా ఉండి ప్రార్థన చేయు"డని ప్రభువు తన శిష్యులకు తెలియజేశాడు (మత్తయి 26:41). స్వస్థ బుద్ధి కలిగి ప్రార్థన చేయుటకు మెలకువగా ఉండుడని పేతురు అన్నాడు (1 పేతురు 4:7). ప్రార్థించేవారు తేటైన మనస్సు కలిగి, ఆశా నిగ్రహం గలవారై యుండాలి. ఒకవేళ నీకు ప్రసిడెంటుతో మాట్లాడే అవకాశం వస్తే, సిద్ధపడవా? ప్రార్థన దేవునితో కూడదమ్మైయుంది. ప్రార్థన దేవునితో మాట్లాడడంకంటె అధిక మయ్యింది – ప్రార్థన దేవునితో ఉండడం. ప్రార్థన చేయకముందు నీవు సిద్ధపడు.

(3) **లేఖనాలను పరిశోధించు**. బైబిలు చదువు. మనం చదివే వాక్యమే మనం ప్రార్థించే వాక్యమై ఉంది. నీవు దేవునితో మాట్లాడక ముందు, దేవుణ్ణి నీతో మాట్లాడనిమ్ము. విషాదకరంగా, లేఖనం కంటె మనకు ప్రార్థన మీద ఎక్కువ గౌరవముంటుంది: "ధర్మశాస్త్రము వినబడకుండ చెవిని తొలగించుకొనువాని ప్రార్థన హేయము" (సామె. 28:9). లేఖనానుసారమైన ప్రార్థనా జీవితం ఉందని చెప్పుకొంటూ, లేఖనాలను చదువ నిరాకరించేవాడు వేషధారి. "దేవుని గ్రంథాన్ని నిరాకరించి," "గ్రంథపు దేవుని"నుండి మనం ఏదీ పొందలేం.

(4) **మారుమనస్సు**. వారి మనవి వినబడాలంటే, పాపులు మారుమనస్సు పొంది దేవుని వైపుకు తిరగాలి. "**ప్రభువు** కన్నులు నీతిమంతులమీదను, ఆయన చెవులు వారి ప్రార్థనల వైపునను ఉన్నవి గాని **ప్రభువు** ముఖము కీడు చేయువారికి విరోధముగా ఉన్నది" (1 పేతురు 3:12). 1 యోహాను 3:22 కూడా చదువు: "మరియు మనమాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి ఇష్టమైనవి చేయుచున్నాము గనుక, మనమేమి అడిగినను అది ఆయనవలన మనకు దొరుకును." కీర్తన. 66:18 యిలా అంటుంది, "నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసినయెడల ప్రభువు నా మనవి వినకపోవును." మన పాపములను ఒకనితో ఒకడు ఒప్పుకొని ఒకనికొరకు ఒకడు ప్రార్థన చేయాలని యాకోబు మనకు ఆజ్ఞాపించాడు (యాకోబు 5:16). పాపభూయిష్టమైన మన యిష్టాలకు దేవుడు బందీకాడు.

(5) **క్రమశిక్షణ**. కొర్నేలీ విషయంలో, ప్రార్థనకు ముందు "ధర్మ కార్యాలు" ఉన్నట్టు చెప్పబడింది (అపొ. 10:2). ప్రార్థనకు ముందు ఉపవాసం వచ్చింది (లూకా 2:37; 1 కొరింథీ. 7:5). మన శ్రేష్ఠమైనదాన్ని దేవునికి యిచ్చేవరకు తన శ్రేష్ఠమైనదాన్ని దేవుడు మనకు యివ్వడు. నీవు దేనికి పూనుకోలేదో దాని విషయమై ప్రార్థించకు. ప్రార్థన తరువాత నీకు ఏమి కావాలని కోరతావో ప్రార్థనకు ముందు నీవు దానికి సిద్ధపడియుండాలి. "ప్రార్థించు … నీవు యింకా ఎక్కువగా ప్రార్థిస్తావు."

## నిజమైన ప్రార్థనా లక్షణాలు

ఇప్పుడు మన లేఖన భాగానికి తిరుగుదాం. గురి నిలిపేది ప్రభువైన యేసుపై.

ఆయన ప్రార్థనా జీవితం పరిపూర్ణమైన మాదిరి. ఆయనకే ప్రార్థన అవసరమైనప్పుడు, అది మనకు యింకా ఎంత అవసరమైయుంటుంది. ప్రభువైన యేసునొద్దనుండి మనం ఏమి నేర్చుకోవాలి?

(1) **నిష్కాపట్యం**. మన ప్రార్థనలు లోపంతో కూడినవైయుంటాయి – మానవ అజ్ఞానంవలన మనకు సొంత యిచ్ఛలు కలుగుతాయి. కాని ప్రభువు యొక్క లోతును ఆయన నిష్కాపట్యాన్ని ఎవడును సందేహించడు. గెత్సేమనేకు ప్రార్థించ ప్రభువు వెళ్లాడు – ఆయనను ఎక్కడ కనుగొనాలో యూదాకు కూడా తెలుసు. దేవుని ప్రసన్నతలో ఆయన ఉండనలవరచుకున్నాడు. యేసు ప్రార్థించినప్పుడు ఆయన చెమట గొప్ప రక్త బిందువులవలె కారింది. మన హృదయమంతటితో వెదకాలని యిర్మీయా చెప్పాడు (యిర్మీయా 29:13). వేషధారణ, మోసము, "దగా లాటివి" ఎల్లప్పుడు మనలను ఓడిస్తాయి. నిష్కాపట్యమనేది ఎల్లప్పుడు సత్ సంబంధాలకు పునాదియైయుంటుంది. మనం నిష్కపటంగా ఉండ నిరాకరించితే ప్రార్థన ఫలించదు.

(2) **తీవ్రత**. "ఆయన వేదనపడి మరింత ఆతురముగా ప్రార్థన చేయగా ఆయన చెమట, నేల పడుచున్న గొప్ప రక్త బిందువులవలె ఆయెను" (లూకా 22:44). ప్రభువైన యేసు ఆతురతగా రెండోసారి మూడవసారి కూడా ప్రార్థించాడు! "నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహు బలముగలదై యుండును" (యాకోబు 5:16). "నీతిమంతుడు" అనేది యాకోబు 5:16లో ఏకవచనం – బహువచనం కాదు.

(3) **అప్పగించుకొను**. ప్రభువైన యేసు మరణము పొందునంతగా వేదనపడ్డాడు. ఆయన "సాగిలపడి"నట్టు మత్తయి చెప్పాడు (మత్తయి 26:39). "మోకాళ్లూని" అని లూకా చెప్పాడు (లూకా 22:41). ప్రార్థనయందు ప్రభువైన యేసు తనను తాను తగ్గించుకొన్నాడు, అప్పగించుకొన్నాడు. ప్రార్థన శరీరాన్ని నిలిపే స్థితికాదు. ప్రార్థన శరీరాన్ని నిలిపే స్థితితో కూడినదై యుంటుంది! తగ్గింపుకొరకు ప్రార్థించడంవలన మనలను మనమే తగ్గించుకుంటాం. అహమును ఖాళీ చేసికొనేది, అహమును విడిచిపెట్టేది ప్రార్థనలో ఉంది. లూకా 18:9–14లోని ప్రసిద్ధిగాంచిన ప్రభువు యొక్క ఉపమానాలలో, సుంకరి తన రొమ్ము కొట్టుకొంటూ – "దేవా, పాపినైన నన్ను కరుణించుము" అని పలికాడు! హెచ్చించుకున్నవాడు తగ్గింపబడ్డాడు; తగ్గించుకున్నవాడు హెచ్చింపబడ్డాడు. బీతోవెన్‌కు చెందిన పియానో వాయిద్యగాడు, పియానోను వాయించడానికి ఆహ్వానించబడ్డాడు. "నేను యోగ్యుడను కాను" అని అతడు తప్పుకున్నాడు. నిజంగా గొప్పవారంతా తగ్గించుకున్నవారే. మార్పు చెందడం అంటే అప్పగించుకొనడమే.

(4) **వీడని ప్రయత్నముతోనుండు. (పట్టుదలతో)**. ప్రభువైన యేసు అదే ప్రార్థనను మూడు సార్లు ప్రార్థించాడు, అయినా ఆయన తన విశ్వాసాన్ని కోల్పోలేదు. అన్యాయస్థుడైన న్యాయాధిపతిని గూర్చిన వింతైన ఉపమానాన్ని ప్రభువు తెలిపాడు (లూకా 18:1–8). అతడు "తొందర" పెట్టబడినందున ఆమెకు అతడు న్యాయం తీర్చాడు (5 వ.) ఆ న్యాయాధిపతి దేవునికి భయపడినవాడు కాదు, నరులను లక్ష్యపెట్టినవాడు కాదు. విసుకక నిత్యం ప్రార్థించాలని ప్రభువు మనకు తెలిపాడు. ఈ ప్రార్థన దేవునికి పరీక్ష కాదు, మనకే పరీక్ష. ఎంత శక్తివంతంగా ప్రార్థించాలో అంతగా ప్రభువు ప్రార్థించాడు, అయినా

దేవుడు “కాదని” ఆయనకు జవాబు యిచ్చాడు! మనిషిని రక్షించాలనే తీర్మానం జరిగింది గొల్గతాలో కాదు గెత్సేమనేలో! అక్కడ దేవుడు “కాదు” అని అన్నాడు – దానికి ప్రభువు “అవును” అని అన్నాడు.

(5) **మెలకువగా ఉండడం.** ఆత్మ సిద్ధమే కాని శరీరం బలహీనంగా ఉంది. ఆయన ప్రార్థించుచుండగా, శిష్యులు మేల్కొనియుండ గోరాదు. వారు నిద్రించారు. మనం నిద్రించుతాం. ప్రార్థనకు సహింపు, ఎరిగిన స్థితి, అవసరత అనేవి కావాలి. ప్రార్థన పోరాటంతో కూడినదైయుంటుంది. మనం కృపచేతనే రక్షింపబడ్డాం. అనుదినం, యేసు యొక్క బలమునందు, పాపానికి కోరిక తీరడానికి మధ్య నిత్య పోరాటముంది. క్రైస్తవులు ఈ యుద్ధానికి సంబంధించిన సైనికులు. ఈ యుద్ధం యొక్క విజయం గాని ఓటమి గాని ప్రార్థనలో ఉంది. మెలకువ కలిగియుండడం ప్రార్థించేలా చేస్తుంది, ప్రార్థించడం అనేది మెలకువ కలిగియుండేలా చేస్తుంది. ప్రార్థించకుండ మెలకువగా ఉండడం అహంభావం; మెలకువ లేకుండ ప్రార్థించడం వేషధారణ. “... కాగా మీరు స్వస్థ బుద్ధిగలవారై, ప్రార్థనలు చేయుటకు మెలకువగా ఉండుడి” (1 పేతురు 4:7). “మంచి ప్రార్థన ఎంత గొప్పదో అపవాదికి తెలుసు”నని జాన్ క్రిసోస్టం ధృవీకరించాడు.

(6) **విశ్వాసం.** ప్రభువు యొక్క ప్రత్యేకించిన ప్రార్థనలకు దేవుడు “లేదు” అనే బదులిచ్చాడు కాని, ఆయనకు పరిచర్య చేయడానికి అప్పుడు దేవదూతను పంపాడు. విశ్వాసం మాట్లాడడమే ప్రార్థన.

> అందుచేత ప్రార్థన చేయునప్పుడు మీరు అడుగుచున్నవాటినెల్లను పొందియున్నామని నమ్ముడి; అప్పుడు అవి మీకు కలుగునని మీతో చెప్పుచున్నాను (మార్కు 11:24).
>
> మరియు మీరు ప్రార్థనచేయునప్పుడు వేటిని అడుగుదురో అవి (దొరకినవని) నమ్మినయెడల మీరు వాటినన్నిటిని పొందుదురని వారితో చెప్పెను (మత్తయి 21:22).
>
> అయితే అతడు ఏమాత్రమును సందేహింపక విశ్వాసముతో అడుగవలెను (యాకోబు 1:6).
>
> విశ్వాససహితమైన ప్రార్థన ఆ రోగిని స్వస్థపరచును (యాకోబు 5:15ఎ).

దేవుడు చేయగలడు అని మాత్రమే గాకుండ, దేవుడు చేస్తాడు అని విశ్వాసం నమ్ముతుంది. గనుక, భూమిమీద విశ్వాసము బహు వాస్తవమైనదైయుంది. శిష్యులు నమ్మారు – ఆ తరువాత వారు ఒప్పింపబడ్డారు! విశ్వసింపక ముందు మనం ఒప్పింపబడాలి!

దీనిని నాకు వివరించు: క్రైస్తవులనబడే అనేకులు ప్రార్థన చేస్తారు, కొద్దిమంది ప్రార్థనకు వెళ్లతారు, కొద్దిమంది బైబిలు చదువుతారు. వారు విశ్వసింపని, మాట వినడానికి నిరాకరించే, ఆ క్రైస్తవులు దేవునికి ఎందుకు ప్రార్థించాలి? దీనికి జవాబు చెప్పు! ప్రార్థన అనేది సార్వత్రికంగా సహాయం కొరకు అర్థించే చివరి ఏర్పాటు, అందులో పోగొట్టుకునేది ఏదీలేదని జనుల భావన. ఈలాటి ప్రార్థన దేవుడు లేకుండగ మతమును కలిగియుండడం అయ్యుంటుంది. ఇంకను దీన్నిగూర్చి ఆలోచించు: “లోపల అంతరంగంలో నేను ప్రార్థనను నమ్మను” అని ప్రార్థనను గూర్చి వ్రాసిన ఒక వేదాంతి యథార్థంగా ఒప్పుకున్నాడు.

నీవు గాఢంగా ప్రార్థనను నమ్ముతావా? ఆ దినంనుండి "ప్రార్థించడానికి ఆరంభిస్తానని" ఆ వేదాంతి ప్రతిజ్ఞ చేశాడు. దాన్ని తాత్వికంగా, సిద్ధాంతంగా చేయకు...ప్రార్థించు! ప్రార్థించడంవలననే నీవు ప్రార్థన నేర్చుకుంటావ్.

తరచుగా ఉపయోగించే వల్లింతలు పని చేయవు. "నేను ప్రార్థించడానికి ప్రయత్నించాను, అది పని చేయలేదని" మనం వింటాం. ఇది మరు జ్ఞాపకాలేగాని ప్రార్థన కాదు. "నీ చిత్తము నెరవేరునుగాక" అనేది లేఖనానుసారమయ్యింది, అయినా అది విడిచిపెట్టబడవచ్చు! నీవు దానిని నమ్మనట్టయితే, దేవుని మనం లక్ష్యపెట్టమని భావం! "నేను నీ చిత్తాన్ని నమ్మను" అని నిశ్శబ్దంగా సర్వోన్నతుడగు దేవునికి చెప్పడమే ఔతుంది.

(7) **"నీ చిత్తము సిద్ధించును గాక."** "అయినను నా యిష్టముకాదు, నీ చిత్తమే సిద్ధించునుగాక" అని ప్రభువైన యేసు ప్రార్థించాడు (లూకా 22:42). "నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరును గాక" అని ప్రభువు మాదిరి ప్రార్థనలో చెప్పాడు (మత్తయి 6:10). 1 యోహాను 5:14, 15 యిలా అంటుంది: "ఆయననుబట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా, ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే. మనమేమి అడిగినను ఆయన మన మనవి ఆలకించునని మన మెరిగినయెడల మనమాయనను వేడుకొనినవి మనకు కలిగినవని యెరుగుదుము." యుక్తంగా ప్రార్థించడం మనకు తెలియదు. రోమా 8:26 యిలా అంటుంది, "అటువలె **ఆత్మయు** మన బలహీనతలను చూచి సహాయము చేయుచున్నాడు. ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్థన చేయవలెనో మనకు తెలియదు గాని, ఉచ్చరింప శక్యముకాని మూలుగులతో ఆ **ఆత్మ** తానే మన పక్షముగా విజ్ఞాపనము చేయుచున్నాడు." దేవుని చిత్తం ఏమైయుండాలో తెలిపి ఆయన చిత్తం జరగాలని కోరడం తెలివి తక్కువ తనం! నరుడు కేవలం దైనికమైనదే గ్రహించలేడు, నిత్యత్వం సంగతి యింకా ఏమని చెప్తుతాం. "నీ చిత్తమే సిద్ధించును గాక" అనడం పూర్తిగా నిస్సహాయ స్థితియే. నరుడు దేవునికి లోబరచుకొంటాడు, దేవునికి అప్పగించు కొంటాడు. అవును, లోకం మారుతుంది. కొందరైతే సంఘాన్ని కూడా మార్చాలను కుంటారు. ప్రాథమికంగా గుర్తు చేయవలసింది ఒకటుంది: "మారే లోకంలో, మార్పు పొందలేని దానిని ఎరిగి దానిని అనుసరించడమే." ఏది మార్పు చెందదో దానిని నీవు ఎరుగకున్నట్టయితే, నీవు తప్పుడు వాటిని మార్చుతావు. ప్రార్థించుతూ దేవుని చిత్త ప్రకారం ప్రార్థించకుండ ఉండడానికి అర్థం ఉండదు. నీ లోతైన ఆలోచనకు దీనిని గమనించు: మన స్థానిక సంఘ కూడికలలో మనం రోగులకొరకు ప్రార్థన చేస్తాం. డాక్టర్ల వైద్యాన్ని దేవుడు వాడుకున్నట్టుగా ప్రార్థిస్తాం. అక్కడనే ఆపకు, అయితే యింకా ముందుకు వెళ్లి – దేవుడు స్వస్థపరచుతాడు అని ప్రార్థించు! డాక్టర్లు లేకుండ కూడా దేవుడు స్వస్థపరచగలడు! దేవుని చిత్తం జరిగే దానికొరకు ప్రార్థించు!

"ప్రభువా, నేను ప్రార్థనయందు నమ్మికయుంచను.
నేను నీయందు విశ్వాసముంచుచున్నాను.
విశ్వాసంతో ప్రార్థన చేయ నాకు నేర్పించండి"